క్లుప్తంగా

వివేకానంద విగ్రహ ఏర్పాటుకు సహకరించండి



మంత్రి బుగ్గనకు స్వామి వివేకానంద చిత్ర పటాన్ని అందజేస్తున్న సభ్యులు

డోన్ టౌన్: దేశ సంస్కృతిని చాటి చెప్పిన స్వామి వివేకానంద విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని వివేకానంద సేవా సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని స్వగృహంలో కలిసి సమితి సభ్యులు విన్నవించారు. స్పందించిన మంత్రి పట్టణంలో విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించాలని వారికి సూచించారు. అనంతరం సమితి సభ్యులు మంత్రికి వివేకానందస్వామి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మలిశెట్టి జగన్‌మోహన్, గౌరవ అధ్యక్షుడు సప్తశైల తిమ్మయ్య, అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణంరెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం



మంటలో కాలిపోతున్న పశుగ్రాసం

బనగానపల్లె రూరల్: మండలంలోని విఠలాపురం గ్రామం వద్ద ఉప్పరి సురేష్‌కు చెందిన పశుగ్రాసం గురువారం రాత్రి దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు కైప గ్రామానికి చెందిన సురేష్ విఠలాపురం గ్రామానికి చెందిన రైతుల వద్ద 70 ట్రాక్టర్ల పశుగ్రాసం కొనుగోలు చేసి అక్కడే గ్రామ సమీపంలో నిల్వ ఉంచుకున్నారు. అయితే గుర్తు తెలియని దుండగులు కావాలనే నిప్పంటించారు. దీంతో మంటలు పెద్దగా వ్యాపించి పశుగ్రాసం పూర్తిగా కాలి బూడిదయ్యింది. సమాచారం అందుకున్న బనగానపల్లె అగ్నిమాపకశాఖ అధికారులు వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి మంటలు ఇతర గడ్డివాములకు వ్యాపించకుండా ఆర్పేశారు. సుమారు రూ.5లక్షల పశుగ్రాసం దగ్ధమయ్యిందని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

సన్మానం



వైద్యాధికారిణి వాణిశ్రీని సన్మానిస్తున్న దృశ్యం

ప్యాపిలి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్యాధికారిణి వాణిశ్రీని ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని యూటీఎఫ్ నాయకులు ఆమెకు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శాంతిప్రియ, మండల ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, నాయకులు నెల్లూరప్ప, విజయ్‌కుమార్, రాజేంద్ర, శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

రుద్రవరం: మండలంలోని పందిర్లపల్లె గ్రామానికి చెందిన ఉల్లెడ నాగేంద్ర (24) అనే వ్యక్తి అదృశ్యమయ్యాడని ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి గురువారం తెలిపారు. జనవరి 16న పచ్చి మిరపకాయలు విక్రయించేందుకని ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదని తండ్రి ఉల్లెడ పెద్ద మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారమివ్వాలని ఎస్‌ఐ కోరారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

గరుడ వాహనంపై విహరించిన నారసింహుడు

ఆళ్లగడ్డ: రామతీర్థ పుట్టాలమ్మ పరుశురామలింగేశ్వరస్వామి క్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీ యోగానంద లక్ష్మీనరసింహ స్వామి గరుడ వాహనంపై అధిరోహించి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం మూల మూర్తులు స్వామి అమ్మవారిని సుప్రభాత సేవతో మేలుకొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భూనీలా సమేత శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వాము వార్లను యాగశాలలో కొలువుంచి అర్చన, అభిషేకం, తిరుమంజనం జరిపించి శ్రీ సుదర్శన హోమం చేపట్టి పూర్ణాహుతి నిచ్చారు. అనంతరం పట్టు పీతాంబరాలతో ముస్తాబు చేసి విశేషంగా అలంకరించిన గరుడ వాహనంపై అధిష్టింపజేసి ఊరేగించారు.

లాభాల వైపు...సాగు!

- మల్చింగ్ వ్యవసాయంతో ఖర్చులు ఆదా
- హెక్టార్‌కు రూ.16వేలు సబ్సిడీ అందజేస్తున్న ప్రభుత్వం
- ఆసక్తి చూపుతున్న రైతులు



మదనంతపురంలో మల్చింగ్ పద్ధతిలో కర్బూజ సాగు చేసిన దృశ్యం

కొలిమిగుండ్ల: వ్యవసాయ రంగానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. విత్తు నుంచి దిగుబడులు అమ్ముకునే వరకు అన్నివిధాలా అండగా నిలుస్తుంది. రైతుభరోసా కేంద్రాలను నెలకొల్పి రైతులకు సలహాలు సూచనలు అందజేస్తుంది. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం ప్రయోజనాలను సంబంధిత అధికారులు రైతులకు వివరిస్తూ చైతన్య పరుస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు వ్యవసాయ పద్ధతులను మార్చుకుంటున్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకుని కొత్త పంథాను ఎంచుకుంటున్నారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహంతో రైతులు మల్చింగ్‌పై దృష్టి సారిస్తున్నారు. ఈ పద్ధతితో పెట్టుబడులు తక్కువ, నీటి ఆదాతోపాటు కలుపు సమస్య లేకపోవడంతో ఆసక్తిచూపుతున్నారు రైతులు. మల్చింగ్ పద్ధతిపై వివిధ రకాల పంటలు సాగు చేసే విధానంపై ఉద్యానశాఖాధికారులు రైతులకు ఎప్పటి కప్పుడు సలహాలు అందిస్తు ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో 54 హెక్టార్లలో మల్చింగ్‌తో పంటలు సాగు అవుతున్నట్లు అధికారుల సమాచారం. కొలిమిగుండ్ల, డోన్, ప్యాపిలి, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల్లో ఎక్కువగా మల్చింగ్‌తో సాగు చేస్తున్నారు రైతులు.

మల్చింగ్ సాగు పద్ధతి ఇలా...

ప్రస్తుతం మల్చింగ్ విధానంలోనూ మార్పులు చోటు చేసుకున్నాయి. గతంలో పొట్టు, ఎండిన ఆకులు, వరి గడ్డి తదితర వాటితో కప్పి పెట్టేవాళ్లు. ప్రస్తుతం వివిధ రకాల మైక్రాన్ కలిగిన ప్లాస్టిక్ పేపర్లు అందుబాటులోకి వచ్చాయి. మల్చింగ్ పేపర్ వేసే ముందు పొలం దుక్కి దున్నుకున్నాక బోడెలు సిద్ధం చేసుకొని ప్లాస్టిక్ పేపర్ వేసి మట్టి కప్పుకోవాలి. తర్వాత ప్లాస్టిక్ పేపర్‌కు అవసరమైన చోట రంధ్రాలు వేసి అందులో విత్తనాలు నాటితే మొలకెత్తుతాయి.

50 శాతం సబ్సిడీ ..

మల్చింగ్ వ్యవసాయాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతులకు రాయితీ కల్పిస్తుంది. ఒక్కో రైతుకు రెండు హెక్టార్ల వరకు పరిమితి ఉంటుంది. మల్చింగ్ పేపర్ కొనుగోలు చేయాలంటే హెక్టార్‌కు రూ.32 వేలు ఖర్చు అవుతుంది. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో హెక్టార్‌కు రూ.16వేలతో అందిస్తుంది. సాధారణంగా హెక్టార్‌కు 600 మీటర్ల మల్చింగ్ షీట్ అవసరం పడుతుంది. కర్బూజ, కళింగర, టమాట, బీన్స్‌తో పాటు కూరగాయలు, పూల సాగుకు అనుకూలం.

చాలా ఉపయోగం

మల్చింగ్ సాగు వల్ల రైతుకు చాలా రకాలుగా ఉపయోగాలు ఉన్నాయి. సాధారణ పద్ధతిలో బోరు కింద ఎకరం పంటకు వినియోగించే నీటితోనే ఈపద్ధతి ద్వారా మూడు ఎకరాల వరకు సాగు చేసుకోవచ్చు. మల్చింగ్ షీట్ ఉండడంతో కలుపు మొక్కలు పెరిగే అవకాశం ఉండదు. దీని ద్వారా కూలీల ఖర్చులు తగ్గుతాయి. మొక్కల దగ్గర తేమ శాతం ఉండటంతో పంటల ఎదుగుదల ఉండి దిగుబడులు బాగా వస్తాయి. చీడపీడల సమస్య చాలా వరకు తక్కువగా ఉంటాయి. వారానికోసారి నీటి తడులు అందిస్తే సరిపోతుంది. పెట్టుబడులు, కూలీల ఖర్చు తగ్గడంతో ఎకరానికి దాదాపు రూ.20వేల మేర ఆదా అవుతుందని అధికారులు చెబుతున్నారు.



పైరును పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారి ధరణి(ఫైల్)

రెండు ఎకరాల్లో కర్బూజ సాగు చేస్తున్నా



మల్చింగ్ విధానంతో రెండు ఎకరాల్లో కర్బూజ పంట సాగు చేశా. ఉద్యాన శాఖ అధికారుల సహకారంతో ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీతో మల్చింగ్ వేశా. ఈపద్ధతి చాలా బాగుంది. కలుపు, కూలీల ఖర్చులు బగా తగ్గాయి. తెగుళ్ల బెడదా లేదు. దిగుబడి కూడా బాగా ఉంటుంది.

– చిన్న పెద్దయ్య, రైతు, మదనంతపురం

ఖర్చు తగ్గింది



ఇటీవల మల్చింగ్ పద్ధతిలో ఎకరాలో కర్బూజ సాగు చేశా. ఖర్చు బాగా తగ్గింది. డ్రిప్ కూడా మల్చింగ్ లోపలే ఉండటంతో నీటి ఆదా అవుతుంది. మా గ్రామంలో రైతులు మల్చింగ్ పై మక్కువ చూపుతున్నారు. కళింగర, కర్బూజ పంటలు పండిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ పద్ధతి సాగు ఎక్కువయ్యే అవకాశం ఉంది.

– శేఖర్,రైతు

రైతులు ఆసక్తి చూపుతున్నారు

ఇటీవల కాలంలో రైతులు మల్చింగ్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ పద్ధతితో రైతులకు చాలా లాభాలున్నాయి. ప్రభుత్వం హెక్టార్‌కు రూ.16వేలు సబ్సిడీ అందిస్తుంది. నాణ్యమైన పంటలు పండించవచ్చు. ఆసక్తిగల రైతులు రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి.

– హరినాథరెడ్డి, ఆత్మ, టెక్నికల్ హెచ్‌ఓ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని తారకరామనగర్‌లో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆ కాలనీలో కరెంటు ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణం నుంచి కంబాలపాడు గ్రామానికి వెళ్లే రహదారి విస్తరణ పనులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

వీధులను పరిశుభ్రంగా ఉంచాలి

బేతంచెర్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో పరిసరాలను, వీధులను పరిశుభ్రంగా ఉంచాలని ఈఓఆర్డీ వెంకట రంగనాయక్ అన్నారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాలను ఆయన సందర్శించారు. ఆర్ ఎస్ రంగాపురం గ్రామంలో ప్రధాన రహదారి వెంట చెత్త చెదారం తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. గ్రామాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి మీ ఇళ్ల దగ్గరకు వచ్చే చెత్త రిక్షాల్లో వేయాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి

డోన్ టౌన్: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి ఐవీఆర్ రెడ్డి కోరారు. జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక డిపో ఎదుట తెల్లవారుజామున కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేసుకున్నప్పటి నుంచి కార్మికులకు అందాల్సిన అలవెన్సులు వెంటనే ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. కార్యక్రమంలో ఈయూ నాయకులు రమణారెడ్డి, స్వామి, చాంద్‌బాషా, చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విద్యాసాగర్

కోవెలకుంట్ల: గర్భిణులు తప్పకుండా ఆరోగ్య సూత్రాలు పాటించాలని డాక్టర్ విద్యాసాగర్ సూచించారు. మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం పీఎంఎస్‌ఎంఏ కింద గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మహిళలు గర్భందాల్చినప్పటి నుంచి ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యంతో పాటు ఆహార విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు, పండ్లు, గుడ్లు తదితర పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మహబూబ్ సుభానీ, హెల్త్‌సూపర్‌వైజర్లు గిరిజ, ప్రభావతి, రాజశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏపీఎం గురుస్వామి

కోవెలకుంట్ల: ఆర్థిక అక్షరాస్యతపై చిరువ్యాపారులకు పట్టణానికి చెందిన చైల్డ్‌ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ సంస్థ దత్తత గ్రామాలైన వెలగటూరు, బిజనవేముల, పెద్దకొప్పెర్ల, అమడాల, సంజామల, ముదిగేడు, కమలపురి, కొత్తపేట గ్రామాలకు చెందిన చిరువ్యాపారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం గురుస్వామి మాట్లాడుతూ చిరువ్యాపారులకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆ సంస్థ కో ఆర్డినేటర్ ఖాదర్‌బాషా, సిబ్బంది ఉసేని, మహేష్, చెన్నయ్య పాల్గొన్నారు.

సమానత్వంతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ అధికారిణి కౌసల్యదేవి

బనగానపల్లెరూరల్: స్త్రీ పురుషుల సమానత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారిణి కౌసల్యదేవి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్), ఐక్యూఏసీ ఆధ్వర్యంలో లింగ సమానత్వంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కౌసల్యదేవి మాట్లాడుతూ ఈ సంవత్సరం డిజిటల్ ఇన్నోవేషన్ టెక్నాలజీ ని స్త్రీ పురుషలకు సమానంగా అందుబాటులోకి తీసుకురావాలని ఐక్యరాజ్య సమితి పిలుపు ఇచ్చిందన్నారు. అధ్యాపకులు సీతమ్మ, సూర్యనారాయణరెడ్డి, వరలక్ష్మీ, వహీదా, రామక్రిష్ణ, మహేశ్వరరెడ్డి, బడేసాహెబ్ మాట్లాడారు. మహిళాలు అనేక రంగాలలో విజయాలు నమోదు చేసుకుంటున్నప్పటికీ సమాజంలో ఇంకా వివక్ష కొనసాగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

నాగలింగేశ్వర స్వామి ఆలయానికి మహర్దశ



బ్రహ్మసూత్ర సహిత మరకత నాగలింగేశ్వర స్వామి ఆలయం

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామ సమీపాన వెలసిన పురాతన బ్రహ్మసూత్ర సహిత మరకత నాగలింగేశ్వర స్వామి ఆలయానికి మహర్దశ రానుంది. గ్రామస్తుల విన్నపం మేరకు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో ఆలయాభివృద్ధికి సీజీఎఫ్ నిధులు రూ. 40 లక్షల మంజూరు అయ్యాయి. ప్రస్తుతం ఉన్న అలయం స్థానంలో గాలిగోపురం, మహా మండపం , ధ్వజ స్తంభం, ముందు ఉన్న బావిని ఆకర్షణీయంగా తీర్చదిద్దనున్నారు. ఈ మేరకు దేవాదాయ శాఖ అధికారులు ప్రతి పాదనలు తయారు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్త చిన్ని శేషఫణి, గౌరవ సభ్యులు చిన్న ఎల్ల రామయ్య తెలిపారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

నంద్యాల: పిల్లల్లో నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవంపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన 'జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లాలోని 1 సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయసు గల 3,99,942 మంది పిల్లలకు అల్బెండజోల్ 400 మి.గ్రా మాత్రలు తప్పకుండా మింగించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో సంవత్సరంపై బడిన పిల్లలందరూ మాత్రలు మింగే విధంగా చూడాలన్నారు. ఆరోగ్యశాఖతో పాటు విద్యాశాఖ, పంచాయతీ రాజ్, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ విభాగం అనుసంధానంతో కచ్చితంగా నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ వాల్‌పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ జఫరుల్ల పాల్గొన్నారు.

పొరపాట్లకు తావివ్వొద్దు

పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మైక్రో పరిశీలకులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై నిర్వహించిన మైక్రో పరిశీలకుల శిక్షణా తరగతుల్లో కలెక్టర్ మాట్లాడారు. పోలింగ్ ప్రక్రియను సూక్ష్మస్థాయిలో పరిశీలించి రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



అధికారులతో చర్చిస్తున్న సెక్టోరల్ అధికారి సునీల్‌రెడ్డి

కొలిమిగుండ్ల: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 13న జరుగనున్న నేపథ్యంలో కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలను గురువారం సెక్టోరల్ ఆధికారి సునీల్‌రెడ్డి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీరు, ఇంటర్‌నెట్ తదితర సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టభద్రులకు 357 పోలింగ్ స్టేషన్, ఉపాధ్యాయులకు 161 పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేసినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్బరాజు, ఆర్ఐ రాముడు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న నేపథ్యంలో కోవెలకుంట్లలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను గురువారం ఎన్నికల సెక్టోరల్ ఆఫీసర్ ఉమాకాంతరెడ్డి పరిశీలించారు. పట్టణంలోని మెయిన్ స్కూల్‌లోని రెండు పట్టభద్రుల, స్పెషల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు, కడప, అనంతపురం పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల భర్తీకి ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ఇందుకు గాను ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట సీఐ నారాయణరెడ్డి, తహసీల్దార్ పుష్పకుమారి, ఎస్ఐ వెంకటరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ఇమ్రాన్ ఉన్నారు.

మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెక్టోరల్ అధికారి ఉమాకాంత్‌రెడ్డి

అవుకు: రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మండల కేంద్రంలోని బీసీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సెక్టోరల్ ఆఫీసర్ ఉమాకాంత్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులపై చర్యలు తీసుకోవాలని మండల అధికారులకు సూచించారు. అలాగే పట్టభద్రుల ఓటర్ల బూత్ నంబరు 353, ఉపాధ్యాయ ఓటర్ల బూత్ నంబరు 158 రూములను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అజాంఖాన్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ శ్రీధర్ రావు, వీఆర్‌ఓలు చంద్రహాస్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డోన్ రెవెన్యూ డివిజన్‌లో 15 పోలింగ్ కేంద్రాలు

- ఆర్డీఓ వెంకటరెడ్డి



డోన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈనెల 13వ తేదీన జరుగనున్న నేపథ్యంలో డోన్ రెవెన్యూ డివిజన్‌లో 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఎన్నికల అధికారి, ఆర్డీఓ వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బేతంచెర్ల ఎంపీపీ స్కూల్ మెయిన్‌లో రెండు పోలింగ్ కేంద్రాలు, డోన్ స్టేషన్ రోడ్డులోని శ్రీసుధ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో నాలుగు, ప్యాపిలి జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా బనగానపల్లె పట్టణంలోని ఎంపీపీ మోడల్ స్కూల్‌లో నాలుగు, అవుకు బీసీ స్కూల్‌లో ఒకటి, కోవెలకుంట్ల ప్రభుత్వ మెయిన్ స్కూల్ ఒకటి, నంద్యాల ఈఎస్‌పీ ప్రభుత్వ పాలిటెక్నిక్ స్కూల్‌లో మరో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లతో పాటు సిబ్బంది, పోలీసులకు కావలసిన మౌలికవసతులు కల్పిస్తున్నట్లు ఆర్డీఓ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బేతంచెర్ల: మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపాన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో గూటుపల్లెకు చెందిన పాలిస్ కట్టర్ మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల మేరకు గూటుపల్లె గ్రామానికి చెందిన పెద్ద రంగయ్యగారి బాలుడు కొడుకు శ్రీరాములు పాలిస్ కట్టర్ గా ఆయా ప్రాంతాల్లో పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈక్రమంలో ఇంట్లో సరుకుల కోసం ద్విచక్రవాహనంపై బేతంచెర్ల వచ్చి తిరిగి వెళ్తుండగా డోన్ రహదారిలో హెచ్ కొట్టాల గ్రామ సమీపాన ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. శ్రీరాములు (32) తలకుతీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో బేతంచెర్లకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య మహేశ్వరితో పాటు ముగ్గురు మగపిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిన్నారులను ఆకట్టుకుంటున్న బెంచ్‌లు



అంకిరెడ్డిపల్లె ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన బెంచ్‌లపై కూర్చున్న విద్యార్థులు

కొలిమిగుండ్ల: రెండో విడత నాడు–నేడు పథకం కింద ఎంపికైన పాఠశాలలకు ప్రభుత్వం బెంచ్‌లు మంజూరు అయ్యాయి. వాటిని ఆయా పాఠశాలలకు చేర్చారు. మండలంలో అంకిరెడ్డిపల్లె ఎస్సీ ప్రాథమిక, కొలిమిగుండ్ల బీసీ, హనుమంతుగుండం, బెలుం ఎస్సీ తదితర ప్రాథమిక పాఠశాలలతో పాటు తిమ్మనాయినపేట, అబ్దులాపురం ఉన్నత పాఠశాలలతో కలిపి మొత్తం 21 పాఠశాలలకు 370 బెంచ్‌లు వచ్చాయి. బాక్స్‌ల్లో విడివిడిగా వచ్చిన వాటిని అమర్చి పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థులు బెంచ్‌లు రంగు రంగుల్లో ఉండటంతో వాటిపై కూర్చొని ఎంజాయ్ చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తుండటంతో తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేగంగా క్లబ్ హౌస్ నిర్మాణ పనులు



డోన్ రైల్వే స్టేషన్ రోడ్డులో రూ. 7.65 కోట్లతో నిర్మితమవుతున్న క్లబ్ హౌస్

డోన్ : పట్టణంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. మోడల్ నియోజకవర్గంగా డోన్‌ను తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఇప్పటికే నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి వైపు పరుగులు తీస్తోంది. రైల్వేస్టేషన్ రహదారిలో ఇప్పటికే రూ.4కోట్లతో బుగ్గన శేషారెడ్డి ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తయి ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనికితోడు పక్కనే ఉన్న అర ఎకరా ఖాళీ స్థలంలో రూ.7.65 కోట్లతో చేపట్టిన క్లబ్ హౌస్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.2.40కోట్లతో ఇండోర్ స్టేడియం, రూ.4కోట్లతో అవుట్‌డోర్ స్టేడియం, రూ.1.25కోట్లతో స్విమ్మింగ్ పూల్‌ను కూడా నిర్మిస్తున్నారు. అదేవిధంగా ఇండోర్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్, జిమ్, స్నూకర్ పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నారు. పైఅంతస్తులో జన్మదిన వేడుకల లాంటి మినీ ఫక్షన్‌లు చేసుకునేందుకు కాన్ఫరెన్స్ హాల్‌ను కూడా నిర్మిస్తున్నారు. అదనంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ కూడా రూపుదిద్దుకుంటోంది. భవిష్యత్తులో ఇక్కడ నిర్వహించే వివిధ రకాల క్రీడా పోటీల్లో పాల్గొనే వారి వెంట వచ్చే కుటుంబ సభ్యులు ఉల్లాసంగా గడిపేందుకు అందమైన పార్కును ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఏళ్లకల క్రీడా ప్రాంగణం ఏర్పాటు కానుండడంతో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి క్రీడాకారులతోపాటు పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



క్లబ్ హౌస్ నమూనా